## క్లుప్తంగా

### నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జడ్జి హరిప్రియ తదితరులు

నరసన్నపేట: స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా రావాడ కొండలరావు, కార్యదర్శిగా జి.వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.ఎం.లక్ష్మి, సహాయ కార్యదర్శిగా యాళ్ల నర్శింగరావు, ట్రెజరర్‌గా వి.శ్రీనివాసరావు, సభ్యులుగా డి.వెంకటరమణ, జామి కామేశ్వరరావు, ఐ.తాత, టి.మధుసూదనరావు, ఆర్.జగన్నాథరావు, శ్రీపాద రామకృష్ణ, డి.రాజ్‌కుమార్ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి జూనియర్ ప్రిన్సిపల్ జడ్జి సీహెచ్ హరిప్రియ తదితరులు అభినందనలు తెలిపారు.

### గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న గిరిజనులు

సరుబుజ్జిలి: గిరిజనుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న, సీపీఎం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సింగూరు గోపాల్, అదపాక రాజేష్‌లు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు సవర కృష్ణ, కార్యదర్శి సవర ధర్మారావు, మిన్నారావు, నగేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి వేతనదారుకి గాయాలు



ఉపాధి పనుల వద్ద గాయపడిన తులసమ్మ

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురం గ్రామానికి చెందిన తమ్మినేని తులసమ్మ అదే గ్రామంలో జరుగుతున్న ఉపాధి పని వద్ద పడిపోయి గాయాలపాలైంది. మంగళవారం ఉదయం గ్రామానికి సమీపంలోని గోసాల చెరువుకు పనికి వెళ్లింది. అయితే పనులు మొదలవ్వకముందే నడుచుకుంటూ వెళ్లి కాలుజారి పడిపోవడంతో ఎడమచేయి విరిగిపోయింది. వెంటనే తోటి కూలీలు చాపర పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎంపీడీవో నరసింహప్రసాద్ పండా, ఏపీవో రవి క్షతగాత్రురాలిని పరిశీలించారు. వైద్య ఖర్చుల బిల్లులు ఉంచాలని, కేంద్ర ప్రభుత్వం ఆయా సొమ్ములు వారి ఖాతాకు జమ చేస్తుందని పేర్కొన్నారు.

### సమస్యల పరిష్కారం కోసమే క్యాంప్ కోర్టు



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆమదాలవలస: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (క్యాంప్ కోర్టు) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వినియోగదారుల గ్రీవెన్స్ ఫోరం చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని తొగరాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంప్ కోర్టు ఉందనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయాలని సూచించారు. క్యాంపు కోర్టు దృష్టికి వచ్చిన సమస్యను 60 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: పౌష్టికాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పాతపట్నం సీడీపీవో టి.విమలారాణి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా పౌష్టికాహార వారోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. వెయ్యి రోజుల సంరక్షణ, పోషక విలువలు, ఆరోగ్యకరమైన ఆహార స్వీకరణపై పాతపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి.అనురాధ, డి.అమరావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతన్నా ఆలోచించు.. భూసారం పెంచు..!



బరటాం ప్రాంతంలో పొలంలో వేసిన చెరువు మట్టి



కృష్ణాపురం ప్రాంతంలో ఎండిన అసర్లవాని చెరువు

- చెరువు పూడిక మట్టిలో పోషకాలు
- రైతుకు ఎరువుల ఖర్చు ఆదా
- సాగులో అధిక దిగుబడులు సాధ్యం

ఎల్.ఎన్.పేట: రైతులు ప్రతీ ఏడాది వారి పంట పొలంలో రెండు, మూడు పంటలను పండించేందుకు విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వలన భూసారం క్షీణిస్తోంది. పొలాన్ని సారవంతంగా చేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వలన పంటలకు కొత్తకొత్త తెగుళ్లు ఆశిస్తున్నాయి. పురుగు మందులు, ఎరువులు ఎక్కువగా వాడడం వలన భూమి పొరల్లో ఉండే మిత్ర పురుగులు నశిస్తున్నాయి. భూమిలో తేమ శాతం తగ్గిపోతోంది. నేలలోని పోషక విలువలు క్షీణించడం వలన పంటలకు తెగుళ్ల ఆశించి దిగుబడులపై ప్రభావం చూపిస్తున్నాయి. అయితే పొలం సారవంతం కావాలంటే చెరువు పూడిక మట్టి వేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. దీనివలన భూమికి మేలు జరుగుతుందని చెబుతున్నారు.

**మిత్ర పురుగుల వృద్ధి**

చెరువులో నీరు నిల్వ ఉన్నప్పుడు ఆకులు, గడ్డి వంటి వ్యర్థాలు కుళ్లి మట్టిలో చేరుతాయి. అందువలన చెరువు పూడిక మట్టిలో తగినంత నత్రజని, భాస్వరం, పొటాషియం, జింకు, బోరాన్, సేంద్రియ కర్బన పదార్థాలు ఉంటాయి. చెరువు మట్టి వేయడం వలన మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు, పంటకు మేలు చేసే మిత్ర పురుగులు పొలంలో వృద్ధి చెందుతాయి. భూమి పొరల్లో తేమను ఎక్కువ రోజుల పాటు ఉండేలా చేసే గుణం చెరువు మట్టికి ఉంది. కిలో పూడిక మట్టిలో నత్రజని 720 మి.గ్రా, భాస్వరం 320 మి.గ్రా, పొటాషియం 810 మి.గ్రా, సేంద్రియ కర్బనం 308 మి.గ్రాలతో పాటు మైక్రోబియల్ బయోమాస్ కార్బన్‌లు ఉంటాయి.

**భూమి సారవంతం**

ఎకరా పొలంలో వరి పండించాలంటే తక్కువలో తక్కువగా ఒక బస్తా డీఏపీ, రెండు బస్తాల యూరియా, ఒక బస్తా పొటాష్, బస్తా జింక్ తప్పనిసరి అవుతుంది. వీటితో పాటు పంటకు ఆశించే తెగుళ్లను నివారించేందుకు పురుగు మందుల పిచికారీ తప్పదు. ఎరువులు, పురుగు మందుల కోసం దాదాపు రూ.5 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే చెరువు మట్టి వేసుకోవడం వలన ఎరువుల ఖర్చు సగం వరకు తగ్గడంతో పాటు భూమి సారవంతం అవుతుంది. ఎరువులు, పురుగు మందుల్లేని పంట దిగుబడులను సాధించవచ్చు.

**పాతపట్నం నియోజకవర్గంలో...**

| మండలం | రెవెన్యూ గ్రామాలు | సాగుభూమి (ఎకరాల్లో..) | సాగునీటి చెరువులు |
|---|---|---|---|
| కొత్తూరు | 36 | 21,500 | 228 |
| పాతపట్నం | 49 | 18,580 | 347 |
| మెళియాపుట్టి | 70 | 20,280 | 185 |
| ఎల్.ఎన్.పేట | 47 | 12,500 | 165 |
| హిరమండలం | 35 | 6,580 | 115 |

**వేసవిలో చెరువు మట్టి వేసేవాళ్లం**



మా చిన్నప్పుడు వేసవిలో చెరువు ఎండిపోతే పూడిక మట్టిని రైతులందరం నాటుబండ్లతో పోటాపోటీగా పెరిగి పొలంలో వేసేవాళ్లం. తొలకరి వర్షాలకు పొలంలో వేసిన మట్టి నేలలో కలిసేలా దుక్కి చేసేవారం. దీంతో ఎరువులు వేయకుండానే పంట ఏపుగా పెరిగేది. ఇప్పుడు రైతులెవ్వరూ చెరువు మట్టి వేయడం లేదు. ఎరువుల వినియోగంతో పెట్టుబడి పెరిగిపోయి, భూసారం తగ్గిపోతోంది.

– లావేటి నర్సింహులు, రైతు, కృష్ణాపురం

**భూసారం పెరుగుతుంది**



చెరువు పూడిక మట్టి పొలంలో వేసుకోవడం వలన భూమి సారవంతంగా మారుతుంది. చౌడు భూముల్లో కూడా పచ్చని పంటలు పండించవచ్చు. చెరువు మట్టిలో తేమ ఎక్కువగా ఉండడం వలన పొలంలో నీటి నిల్వలు ఉండి పంటకు తేమ అందుతుంది. సేంద్రియ శాతం ఎక్కువగా ఉండడంతో చెరువు మట్టి ఎరువులా ఉపయోగపడుతుంది. ఒక సంవత్సరం చెరువు మట్టి వేయటం వలన మూడేళ్ల వరకు భూమి సారవంతంగా ఉంటుంది.

– పైడి లతశ్రీ, ఏవో, ఎల్.ఎన్.పేట

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



హిరమండలం: ఇంటింటా ప్రచారం చేస్తున్న అధ్యాపకులు



నరసన్నపేట: అంగీకార పత్రం అందజేస్తున్న విద్యార్థి తండ్రి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవోలు యు.శాంతారావు, పేడాడ దాలినాయుడులు అన్నారు. మండలంలోని తామరాపల్లి, వంశధార కాలనీల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, వారికి అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని తెలియజేశారు. స్కూల్స్‌లో అమలు చేస్తున్న ఉచిత పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు ముచ్చ గణేష్, గొద్దు జగన్మోహనరావు, దండి జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులు చేరాలని అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక జూనియర్ కాలేజీకి చెందిన అధ్యాపకులు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ కాలేజీల్లో వసతులతో పాటు ఉత్తమ విద్యాబోధన అందిస్తున్న విషయాన్ని వివరించారు. విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల కోర్సులు, సబ్జెక్టులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.బాలకృష్ణ, పి.ప్రశాంతి సాయి, పీవీ నరసింహులు, డి.రాజేంద్రకుమార్, సుధాకర్, ఎస్.సూరిబాబు, ఝాన్సీలక్ష్మీ బాయి, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలను జయప్రదం చేయండి



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: దేశంలో నిరుద్యోగ యువత ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువజన హక్కుల కోసం పోరాటం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుటనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల గోడ పత్రికను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అమ్మేస్తోందని మండిపడ్డారు. యువతకి ఉద్యోగాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ మార్పు రావాలంటే యువత ముందుండి పోరాటం చేయక తప్పదన్నారు. దీనిలో భాగంగా మే 15వ తేదీన తిరుపతిలో జరిగే బహిరంగ సభకు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ధనుంజయ్, మోక్షిత్, తేజ, సిద్ధార్థ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేకు రైతులు సహకరించాలి



హిరమండలం: బొమ్మికలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సారవకోట: భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని దాసుపురం రెవెన్యూ గ్రామంలో భూముల రీ సర్వేకు సంబంధించి అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రీసర్వే పూర్తికాని గ్రామాల్లో ప్రస్తుతం రీసర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, మండల సర్వేయర్ రామకృష్ణ, రీసర్వే డీటీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సారవకోట: ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో కృష్ణమూర్తి తదితరులు

నరసన్నపేట: మండలంలోని నడగాం, కొత్తపోలవలసల్లో నిర్వహించనున్న రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. ఈ గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇప్పటివరకు మండలంలోని 28 రెవెన్యూ గ్రామాల పరిధిలో సర్వే పూర్తయ్యిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ అప్పలస్వామి, రీసర్వే డీటీ కృష్ణ, ఆర్ఐ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం: భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నీలిమ సూచించారు. రెండో విడతలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా మంగళవారం బొమ్మికలో రీ సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిభావంతో మెలగాలి



ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేస్తున్న రవికుమార్

ఆమదాలవలస: సమాజం అభివృద్ధి చెందాలంటే యువత భక్తిభావంతో మెలగాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని కొర్లకోట గ్రామంలో పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ సువ్వారి నేతాజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, పార్టీ నాయకులు చిగురుపల్లి రవికుమార్, గురుగుబెల్లి తేజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### నేటి నుంచి తీరప్రాంత గస్తీ

పోలాకి: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో బుధవారం నుంచి రెండు రోజుల పాటు తీర ప్రాంత గస్తీ చేపట్టనున్నట్లు నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 50 మంది సిబ్బందితో గస్తీకి షెడ్యూల్ నిర్ణయించామన్నారు. తీర ప్రాంతాల్లో ఎవరైనా తెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు.

### వృత్తి విద్యా నైపుణ్యాలు అవసరం

పాతపట్నం: విద్యార్థులకు వృత్తి విద్యా నైపుణ్యాలు అవసరమని ప్రభుత్వ ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి అన్నారు. స్థానిక ఆల్ ఆంధ్రరోడ్డులోని కంప్యూటర్ సెంటర్‌లో విద్యార్థులకు ఇంటర్నెట్, ఫొటోషాప్‌పై మంగళవారం అవగాహన కల్పించారు.

### ఈనెల 14న ప్రతిభా పరీక్ష

హిరమండలం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని మండలంలోని రెల్లివలస ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన 5, 8వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు సంఘ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ప్రతీ తరగతికి గరిష్ఠంగా ఐదుగురు వరకు ప్రతిభా పరీక్షలకు హాజరుకావచ్చునని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల పేర్లను ఈనెల 11వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

### పరామర్శ



సర్పంచ్ అప్పలనాయుడిని పరామర్శిస్తున్న రవికుమార్

సరుబుజ్జిలి: మండలంలోని విజయరాంపురం సర్పంచ్ బెండి అప్పలనాయుడుని వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మంగళవారం కేజేపేటలో పరామర్శించారు. ఇటీవల సర్పంచ్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందారు. దీంతో ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పార్టీ నేతలు మామిడి తిరుపతిరావు, బొడ్డేపల్లి హరి, వీరఘట్టపు కృష్ణ తదితరులు ఉన్నారు.

జలుమూరు: మండలంలోని లింగాలవలస ఎంపీటీసీ సభ్యురాలు బుక్కా తేజోవతి అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆ కుటుంబాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ మంగళవారం పరామర్శించారు. ఆయనతో పాటు పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, ఎం.శ్యామలరావు, రాజప్పల నాయుడు, దామ మన్మథరావు, ధర్మాన జగన్, జుత్తు నేతాజీ, సేపాన వేణు, ధర్మాన రమణ మూర్తి, కల్యాణం శ్రీనివాసరావు, బోర సింహాచలం, వాన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ ధరలు తగ్గించాలి



నరసన్నపేట: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: ఒక్కసారిగా వంటగ్యాస్ ధరలు రూ.50లు పెంచడం దారుణమని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, కనపల శేఖరరావు, బగ్గు రమణయ్యలు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పెంపుభారం ప్రజలపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఇప్పుడు మరలా వంట గ్యాస్‌పై పెంచడం వలన సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తుండడం వలన, బీసీ కార్పొరేషన్ రుణాలు అర్హులకు అందడం లేదని మండిపడ్డారు. అర్హతే ప్రమాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

కొత్తూరు: పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వం తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తూరులో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్‌పై గరిష్ఠంగా రూ.50లు పెంచడం దారుణమన్నారు. ఎన్నికల ముందు ధరల తగ్గిస్తామని చెప్పి, ఇప్పుడు అమాంతం ధరలు పెంచేస్తున్నారని మండిపడ్డారు. ఆయనతో పాటు సీపీఎం నాయకుడు నిమ్మక అప్పన్న ఉన్నారు.

### ఎండలోనే సైకిళ్లు



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస, సరుబుజ్జిలి, కొత్తకోట, కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సైకిల్ షెడ్లు నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ పాఠశాలలకు ప్రతీరోజు విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి సైకిళ్లపై రాకపోకలు చేస్తుంటారు. అయితే సైకిళ్లను భద్రపరిచే సదుపాయం లేకపోవడం వలన ఆరుబయటనే ఎండలో పెడుతున్నారు. దీనివలన వేగంగా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సైకిల్ షెడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

### సీసీ కెమెరాలు ఏర్పాటు



కొత్తూరు మండలంలోని పలు దేవాలయాలు, చర్చిల వద్ద సీసీ కెమెరాలను సీఐ చింతా ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ అమీర్ అలీలు మంగళవారం ఏర్పాటు చేశారు. ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు మండలంలో మొత్తం 20 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

– కొత్తూరు

### ఆధార్ కేంద్రంలో అక్రమ వసూళ్లు..?



పాతపట్నం కోర్టు కూడలిలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌లో అధిక మొత్తంలో ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా రూ.100లు తీసుకోవాల్సిన సేవలకు, రూ.150ల నుంచి రూ.300లు వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై ప్రశ్నించిన వారికి సేవలు అందించడం లేదని పలువురు వాపోతున్నారు. ఇదే విషయాన్ని తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ వద్ద ప్రస్తావించగా ఆధార్ కేంద్రాలను పరిశీలిస్తామని, అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– పాతపట్నం

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మండపం ప్రారంభిస్తున్న కృష్ణదాస్, పద్మప్రియ

జలుమూరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని సైరిగాం గ్రామానికి చెందిన పొన్నాన సింహాచలం తన తల్లిదండ్రులు నరసమ్మ, తాతయ్యల జ్ఞాపకార్థం పాతపట్నం నీలమణి అమ్మవారికి తన సొంత నిధులు వెచ్చించి మండపం నిర్మాణం చేశాడు. దీంతో ఆ మండపాన్ని కృష్ణదాస్, ఆయన సతీమణి పద్మప్రియలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు, మండపాలు ఏర్పాటు చేయడం వలన శాంతి నెలకొని, మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. సింహాచలం మరింత మందికి స్ఫూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, సర్పంచ్ ధర్మాన అనిత, ఎంపీటీసీ వెలమల అసిరినాయుడు, నాయకులు ధర్మాన రమణమూర్తి, ధర్మాన జగన్, పి.ముసలి నాయుడు, పొన్నాన శ్రీరాములు, భాస్కరరావు, అప్పారావు, తాతయ్య, సత్యం, సుందరరావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, ఎం.శ్యామలరావు, రాజప్పల నాయుడు, దామ మన్మథరావు, బగ్గు గౌతమ్, కల్యాణం శ్రీనివాసరావు, సేపాన వేణు, పి.విజయ్, నరసన్నపేట యవజన విభాగ అధ్యక్షుడు బుద్దల రాజశేఖర్, బి.ఈశ్వరరావు, తోట భార్గవ్, పంగ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

### గుణాత్మక విద్యనందించాలి

హిరమండలం: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని ఎంఈవో రాంబాబు సూచించారు. మండలంలోని సుబలాయి ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆయనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

**ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి**

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంఈవో-1 సీహెచ్ మణికుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను ప్రభుత్వ బడిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.